పెద్ద కథ

# ఓ సత్యం కథ

## గరికపాటి కృష్ణమూర్తి

"దేవుడో! దేవుడో! నన్నిడిసిపోయావా దేవుడా!!
నా పిల్లల్ని నట్టేట ముంచెల్లావా దేవుడా!!!"

రామి కన్నీరు మున్నీరుగా మొగుడు శవంమీద పడి యేడుస్తోంది

చూస్తూ చుట్టూ చేరిన స్త్రీలందరూ చీదేస్తున్నారు. పైటకొంగులతో కన్నీళ్లు తుడుచుకొంటున్నారు.

గంటైనా భోరుభోరున యేడుస్తూనే వుంది. తలను నిమిరింది. వక్షస్థలంమీద పడిపోయింది కాళ్లను తడిమింది. చేతులను ముద్దాడింది. చెంపకు తన చెంపను ఆనించి కన్నీటిధారలతో భర్త ముఖాన్ని అభిషేకం చేసింది.

గుండె పగిలి చచ్చిపోతుందేమోనని చిన్నమ్మ రామిని తన అక్కున జేర్చుకోబోయింది. ఒక్క విసురు విసిరేసి భర్తమీద పడిపోయింది. ఇంత దుఃఖాన్ని భరించలేనట్లు ఆపాదమస్తకాన్ని ఆలింగనం చేసుకుంటూ విలవిలా కొట్టుకుంటోంది.

మళ్లీ మళ్లీ ఆ శవాన్ని హృదయానికి హత్తుకుంటోంది.

హృదయంలో ఉద్భూతమైన హోరును భర్తకు విప్పిస్తుందా అన్నట్లుంది. ఘోష వినమని చెప్తున్నట్లుంది.

ఆ ముఖంలో, ఆ చేతుల్లో, ఆ కాళ్లల్లో తన ఆనందం, తన బలం, తన శక్తి ఉన్నవి. తన ఆశలు ఆశయాలు భావనలు — కామనలు — అన్నీ వాటిల్లో పెనవేసుకున్నయ్. చివరకి తన జీవితం, తన ప్రాణం, సర్వస్వం ఆయనలో ఉన్నయ్. ఇవన్నీ యెవరికి తెల్సు?

ఇప్పుడవన్నీ లేవంటే యెలా? ఏమైపోవాలి? ఏమిటి దారి?

"దేవుడో!... దేవుడో..."

రామి హృదయాంతరాళాల నుండి పెల్లుబికి వస్తున్న దుఃఖానికి సత్యం హృదయం ద్రవించిపోయింది. ఆర్ద్రత చెందింది.

రామికి భాష చాలటంలేదు. భర్తృ విహీన శూన్యాన్ని చెప్పలేకపోతున్నది. అదెంత భీతావహమో- యెంత అంధకారబంధురమో ఒకసారి ఆ దుఃఖంలోనే దృష్టిని ముందుకు సారించి "అమ్మో అమ్మో" అని మాత్రం బిగ్గరగా యేడ్వగల్గుతోంది.

### ప్రారంభం!

"నిన్నిపాటేలప్పుడు ఇటే యెల్తూ చిన్నమ్మా నీ రోగం కుదిరిందాని పలకరించి మరీపోయాడే బిడ్డ! ఇయ్యాలతో నూరేళ్లు నిండినయ్.. అంతా మాయగా ఉందే ..."

మాయ! అంతా మాయ
నిన్న వెంకడు నిజం!
నేడు వెంకడు మాయ.
నిన్న రామి కలలు నిజం.
ఇవ్వాళ అబద్ధం

కాని ఇది యదార్థమైన సత్యమేనా? సత్యానికి వెంకడి శవం యదార్థంలా తోచింది వెంకడి భార్య రోదన యదార్థం. పిల్లల క్షోభ యదార్థం.

హెచ్చరిక లేకుండా వటవృక్షాన్ని కూకటి వేళ్లతో పెళ్లగించేసిన ప్రభంజనానికి లేచిగురుటాకు లాంటి వెంకడి పిల్లలు ముందు ముందు మాడి పోవటం యదార్థం.

లేనిదేదో కనుక్కోమనే మాయా దర్పణం ఎక్కడుందో తెలియదు. కళ్ల ముందున్న అద్దం ఆత్మజ్ఞానాన్ని బోధిస్తుంది.

వెంకడి భార్యా బిడ్డలకు ఆర్థిక భద్రతేమిటి? సాంఘిక రక్షణ యెక్కడుంది? రామికి పతి ప్రేమ, పిల్లలకు తండ్రి మమతాను రాగాలు యెక్కడ దొరుకుతాయ్?

"పోలీసులు ... పోలీసులొస్తున్నారు"

వెంకడు అన్నకొడుకు సుగుణరావు వచ్చాడు మున్సబు రిపోర్టుమీద పోలీసులు వస్తారని ఎదురు చూస్తున్నదే!

పోలీసు జీపు ఆగగానే యెవరికి వారు తప్పుకొన్నారు.

అయినవాళ్లు నలుగురైదుగురున్నారు
కానివాడు సత్యం కూడా ఉన్నాడు.

పక్కయింట్లో నుండి సబ్ యిన్‌స్పెక్టరుకు ఒక కుర్చీ తీసుకొచ్చి వేశాడు సుగుణరావు కానిస్టేబుల్స్‌కు మంచాలు వాల్చాడు. కాని వాళ్లెవరూ కూర్చోలేదు. సబ్ యిన్‌స్పెక్టరు వాంగ్మూలం తీసుకొనటం మొదలెట్టాడు ముందుగా సుగుణరావు ముందుకు వచ్చాడు

సుగుణరావు వెంకడికి స్వయాన అన్నకొడుకు. ఇరవై అయిదేళ్లుండవచ్చు. ఎనిమిదో తరగతివరకూ చదువుకున్నాడు. తండ్రి యిచ్చిన యెకరం కొండ్రను దున్నుకుంటూ, అందరితోబాటు కూలీనాలీ చేసుకుంటూ బ్రతుకుతున్నాడు.

ఈ దారుణం జరిగేటప్పుడు సుగుణరావు తన చేను గట్టున ఉన్నాడు. చేనుకు, ఈ సంఘటన జరిగిన ప్రదేశానికి నాలుగైదు ఫర్లాంగుల దూరముంది. ఏదో మాటా మాటామీద ఘర్షణ పడుతున్నారనుకొన్నాడుగాని చిన్నాన్నను చంపేస్తారని అనుకోలేదు.

తనలాగే పొలంలో వున్న లక్ష్మడు కర్రతో పరుగు పరుగునవచ్చి అక్కడ నాటటం, నిమిషంలో చిన్నాన్నను తల బద్దలుకొట్టి పారిపోవటం చూశాడు ఏదో అవాంతరం జరగబోతుందని పసిగట్టి తనూ పరుగెత్తాడు.

కాని జరగవలసిందేదో అప్పటికే జరిగిపోయింది. చిన్నాన్న రక్తపు మడుగులో ఉన్నాడు. స్పృహ కోల్పోయే స్థితికి వచ్చేశాడు. దాహం కోసం నోరు తెరుస్తున్నాడు.

"ఇదిగో ఈ సత్యంగారే ప్రక్క చెల్లలో నీళ్లను దోసిట్లో పట్టి నోట్లోపోశారు. అదే.. ఆ నీరే మా చిన నాన్నకు తులసి తీర్థమైంది."

చూసింది చూసినట్లు సుగుణరావు చెప్పాడు.

ఆ చెప్పిన దాంట్లో వెంకడిని చంపటానికి లక్ష్మడికిగల పగ, ద్వేషమేమిటో, తగిన కారణాలేమిటో సబ్‌యిన్‌స్పెక్టరు కర్థం కాలేదు

అదే అడిగాడు.

"నాడు పరశురామయ్యపాలేరు. మా చిననాన్న పరశురామయ్యగారి పొలాన్ని మా హరిజనుల యిళ్ల స్థలాల కోసం పెట్టాడు. అది జరుగుతూవుంది ఈ మధ్యన సర్వేయరు కూడా వచ్చి, పొలం కొలిచి రాళ్లు వేసెల్లాడు. వాటిని తీసెయ్యమని ఒకణ్ణి పంపాడు. మా చిన్నాన్న అది సబబుగాదని చెప్పటానికి వెళ్లి ఉంటాడు."

"పరశురామయ్య పొలానికి పెడితే లక్ష్మడికి మీ చిన్నాన్నమీద పగ పెట్టుకోనాల్సిన పనేముంది?"

సబ్‌యిన్‌స్పెక్టరు అడిగినదానికి సత్యానికి వళ్లు మండింది.

"ఆయన డబ్బున్నవాడు! వీడు డబ్బువాడు."

సబ్‌యిన్‌స్పెక్టరు తలెత్తి సత్యంవంక జూశాడు, నీకేమి సంబంధమన్నట్లు.

నిన్నెవరు అడిగరన్నట్లున్నవి ఆ చూపులు

"వారు సత్యంగారని యీ వూరేనండి. యం బి బి. యస్, చదువుతున్నారు. ఆ పరశురామయ్య తమ్ముడిగారికి కాబోయే అల్లుడుగారు"

"అలాగా" మొఖం కొంచెం తటపడింది

"కూర్చోండి."

సత్యం మంచంమీద కూర్చున్నాడు.

సబ్‌యిన్‌స్పెక్టరు "ఏ కాలేజండి"

చెప్పాడు.

"ఇయర్."

"ఫోర్తియర్"

సత్యానికి అప్రస్తుతపు సంభాషణ అంత రుచించలేదు.

మభావాన్ని గ్రహించాడు సబ్‌యిన్‌స్పెక్టరు

విషయాన్ని మారుస్తూ "మీరుకూడా వాంగ్మూలం యిస్తారా ?"

"వై నాట్."

"గుడ్."

సబ్‌యిన్‌స్పెక్టరు చాలా సంతోషపడ్డాడు. చచ్చినవాడి ఖరీదు చాలా తక్కువ. కేసు కూడా పేలపుపిండిలా యెగిరిపోతుందనుకున్నాడు.

పై పెచ్చు పరశురామయ్య కుటుంబానికి బంధువు కాబోతున్నవాడే సాక్ష్యం యివ్వటానికి ముందుకు వస్తున్నాడు. ఇప్పుడు మొదటి ముద్దాయిగా పరశురామయ్యనే పెట్టొచ్చు. కేసు బలమైనవాళ్లమీద బలంగా నిలబడుతుంది. అటు కేసుకు కేసూ బలంగా ఉంటుంది. ఇటు తనకూ...

పాలను చిలికితేనే వెన్న వచ్చేది నీళ్లను చిలికితే యేమొస్తుంది !?

"అయితే మీరు పోలీసు స్టేషనుకు రావాలి శవాన్ని పోస్టు మార్టమ్‌కు పంపిస్తున్నాం."

ఈ లోపల పోలీసులు శవాన్ని వ్యాన్‌లోకి యెక్కించారు.

రామి ఆ శవాన్ని వదలలేకపోతోంది. తనూ వ్యాన్‌లోకి యెక్కింది.

"పరీక్ష చేయించగానే మీకే ఇచ్చేస్తామమ్మా" కానిస్టేబుల్ నచ్చజెప్పుతున్నాడు.

ఇంతలో సుగుణరావు వెళ్లి చిన్నమ్మను బయటకు తీసుకొచ్చాడు.

ఆదే వ్యానులో సత్యం, సుగుణరావు లిద్దరూ టౌనుకెళ్లారు.

ఈ వార్త ఊళ్లో దావానలంలా వ్యాపించి పోయింది. ఊరంతా అట్టుడుకి నట్లుడికిపోయింది. ప్రతినోట సుగుణరావుతోబాటు సత్యం వాంగ్మూలం యివ్వటానికి టౌనుకెళ్లాడని చెప్పుకుంటున్నారు.

ఈలోగా లక్ష్మడు ఊరొదలి పారిపోయాడు. ఈ పరిస్థితితుల్లో వూళ్లో వుండటం అంత శ్రేయస్కరం కాదని పరశురామయ్య కూడా పొలం చూడటానికని వెళ్లి ఆ దారినే ప్రక్క వూళ్లో బస్సెక్కి పోయాడు.

అందరూ అనుకొంటున్నట్లు పోలీసులు వచ్చారు. పరశురామయ్య, లక్ష్మడులకు అరెస్టు వారంట్లు తెచ్చారు. ఇళ్లకెళ్లి హడావిడి చేశారు వాళ్ల బంధువుల పేర్లు—వూర్లు తెలుసుకున్నారు

## 2

ఇదంతా రామనాధానికి అయోమయంగా ఉన్నది సత్యం వాంగ్మూలం యివ్వటానికెళ్లాడనగానే గుండెలో రాయి పడ్డట్లయింది. ఏదో జరగరానిది జరిగిపోయినట్లు ఆయన బాధ పెట్టుకొన్నాడు ఇక శాంతమ్మ దిగులే పెట్టుకుంది. కొడుకుకు ఏ ఆపదా, అవాంతరం రాకూడదని ఇలవేల్పులకు మాటి మాటికి మొక్కు కొంది.

* * *

కుటుంబం చిన్నదైనా రామనాథం నలుగురిలో గౌరవంగా హుందాగా నడుపుకొస్తున్నాడు ఉన్న మూడెకరాల కొంద్రతోనే సంసారాన్ని లాగిస్తూ, పిల్లల భవిష్యత్‌కు మంచి బాటలు వేస్తున్నడు తన ఆర్థిక పరిస్థితికి మించిన భారమే అయినా కుర్రాడు బాగా చదువుకుంటున్నాడు, వృద్ధిలోకి వస్తాడని చదువు చెప్పిన పంతుళ్లు చెప్తే పట్నం కూడా దగ్గరే గదాని కాలేజీకి పంపించాడు

ఇంటర్మీడియట్‌లో చేరేటప్పుడు సత్యం వయస్సు చిన్నదే. అయినా తన చదువును గూర్చి అప్పుడప్పుడూ తల్లిదండ్రులు చేసే సంభాషణ వింటూ ఉండేవాడు.


చేలో పండిన పంట యెలా ఖరాకండికగా తినటానికే సరిపోతుందో, తన శ్రమంతా ఉన్న కొంద్రతోనే యెలా ఖర్చయిపోతోందో —

అమ్మేమో ఆయనకు సహాయంచేయలేనిస్థితిలో ఉంటున్నందుకు అప్పుడప్పుడూ విచారించటం — ఉన్నదాంట్లోనే అన్నీ పొదుపుగా, ఒబ్బిడిగా చేసుకొని రావటం — యివన్నీ వింటుండేవాడు చూస్తుండేవాడు.

ఆయనకంటే ముందే లేచి చదువుకొంటున్న తనను చూసి తండ్రి మురిసిపోవటం తనకు తెల్సు ఆ కళ్లల్లో కాంతుల్ని అనేకసార్లు చూశాడు అప్పుడాయన కాళ్లల్లో ఏనుగంత బలమొచ్చేది.






# ఓ సత్యం కథ

"సత్యం! సదువుకొంటున్నావా బాబు! సదువుకో సదువుకో... సదువుకో..."

'స' కి 'చ' కి భేదం తెలిని తండ్రి ఆ భేదా లేమిటో నేర్పే విచక్షణా జ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాడు.

ముల్లుకర్ర చేతపట్టుకొని, కిర్రుచెప్పులేసుకుని చకచకా పొలం వైపుకు నడిచివెళ్లే తండ్రి వైపు అనేకసార్లు అలా చూస్తూ వుండిపోయేవాడు.

ఆ పొలం పండించాలి. ఈ యేడు ఇరవై బస్తాలు. వచ్చే యేడు ఇరవై ఐదు. ఆ పై యేడు ముప్పై. ఇంకా పండించాలి. ఇంకా యెక్కువ కష్టపడాలి. అదీ ఆయన ధ్యేయం.

దేనికి !?

వయసు పెరుగుతున్నా – శక్తి తగ్గిపోతున్నా పెరుగుతున్న బాధ్యతలను సంతృప్తిగా నెరవేర్చ టానికి కష్టపడాలి. శక్తిని పెంచుకోవాలి.

శక్తి తింటేనే రాదు. నాన్నకాశక్తి తిండి వలన రాదు.

తనవలన–చెల్లి పద్మవలన.

అంత బలంగా అడుగులు వేసుకుంటూ పోయే నాన్న కాసేపు ఆ గడ్డ ఈ గడ్డ పనిచేసి, చెమట తుడుచుకుంటూ అలసిపోయి, చేలో గంగరావి చెట్టు క్రింద ఒక పెద్ద గడ్డను తల దిండుగా మార్చుకొని నిద్రపోతూ ఉండటం తను అనేకసార్లు చూశాడు.

ఆ చెమటబిందువులన్నీ తమకు రక్తబిందువులు కావాలని, ఆయన ప్రతి అవయవాన్ని వంచి పని చేసిన ఆ క్షేత్రం సుక్షేత్రమై–తమ భావిజీవిత క్షేత్రాలను సశ్యశ్యామలం చేయాలని ఆయన తాపత్రయం.

అమ్మ పాలెందుకు అమ్ముతుందో...వేడినీళ్లకు చన్నీళ్లు తోడంటూ పది కోళ్లను యెందుకు మేపు తుందో అర్థం కాకపోలేదు.

తాను చిరిగిపోయిన చీరలను కట్టుకుంటూ తన బట్టలను ఇస్త్రీకెందు కేస్తుందో కూడా తెలుసు.

అమ్మమ్మ యిచ్చిన రెండు బంగారు గాజుల్ని చెడగొట్టి పద్మకి చెయిన్ చేయించిన విషయమూ తెల్సు

వారికి కావల్సిందేమిటి ?

తమ కళ్లల్లో కాంతులు ... వెలిగే దీపాలు.

వారిద్దరూ పోలికులు.

వారి జీవిత వనంలో తాము పారిజాతాలు.

చక్కగా విరిబూయటమే వారికి హృదయా నందం.

కృతజ్ఞత తాము తీర్చుకునే ఋణం.

వారికి సంతోషం కల్గించే పనులు చేయటమే తమ పని.

వారు గర్వపడేటట్లు చదవటమే తన కర్తవ్యం అలా సాగిపోయేవానాడు సత్యం ఆలోచనలు.

సుందరమైన సుదూరభావిని గూర్చిన కలలు కంటే నలుగురు తనను గూర్చి పొగుడుతున్నప్పుడు వారు పొందే సంతోషం, ఆనందాల కోసమేనన్నట్లు సత్యం పట్టుదలతో చదివేవాడు. క్లాసులో శ్రద్ధగా వినేవాడు. చురుకుదనానికితోడు పరిశ్రమ తోడైంది.

ఫలితంగా యింటర్ ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు.

ఆ వూరిలో ఫస్టుక్లాసు తెచ్చుకొన్నవారిలో సత్యమొక్కడే.

ఆనాడు రామనాథం, శాంతమ్మల ఆనందానికి అవధులే లేవు.

నలుగురూ కొడుకుని గురించి చేసిన పొగడ్త లను భర్త చెప్తుంటే ఆనంద బాష్పాలు రాల్చు కుంటూ అలా వింటూ ఉండిపోయింది. ఎవరు పెట్టాలన్న ధ్యాసే లేదు.

పిల్లాడికి దిష్టి తగులుతుందని సత్యం యింటికి రాగానే యెండుమిరపకాయలు, ఉప్పు ధూపంతో దిగదుడుపు తీసింది.

ఆ రోజు ప్రత్యేకంగా మిఠాయి చేసింది. పక్కింటివాళ్లకు కూడా పంచిపెడుతూ "వదినా! మా సత్యం ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడంట. అందుకని" సంతోషాన్ని కూడా నలుగురికీ పంచి పెట్టింది.

ఆ సాయంత్రం రామనాథం ప్రొద్దుటున్నంత సంతోషంగా లేడు.

సత్యం చదువైపోగానే ఉద్యోగానికెళ్తాడు. తనకేదో యింత అండదండగా ఉంటాడని భావిం చాడు. ముందుగా పద్మని ఒక యింటిదానిని చేసి తర్వాత వాడి పెళ్లి కూడా చేసేస్తే తన బరువు బాధ్యతలు తీరిపోతయ్యనుకున్నాడు ఇదే అభిప్రాయాన్ని నలుగురుముందూ వెల్లడించేవాడు.

కాని యీ రోజు —

"బంగారంలాంటి కుర్రాణ్ణి యెందుకు పాడుచేస్తావ్ రామనాథం. ఫస్టుక్లాసు రావటమంటే మాటలుగాదు. ఎంతో తెలివిగలవాడైతేనేగాని రాదు వాడు అదృష్టవంతుడు. మధ్యలో చదువు మాత్రం ఆపబోకు. మన కష్టాలు యెప్పుడూ ఉండేవే. ఇంకా నాలుగైదేళ్లు కష్టపడ్డావంటే వాడు పెద్ద డాక్టరో, ఆఫీసరో అయి నీ కష్టాలు తీర్చకపోడు పిల్లాడు కూడా బుద్ధిమంతుడు."

రచ్చబండ దగ్గర నలుగురూ అన్నమాటల సారాంశమిది.

తననుకొంటున్నట్లు ఉద్యోగాలు కూడా అంత తేలికగా దొరకవట. ఈ లోపల ఏం చెయ్యాలి ?

కొడుకు మెరికలాంటి వాడైనా పైకి తీసుకు రాలేని తన ఆర్థిక దుస్థితికి వాపోయాడు.

మొట్ట మొదటిసారిగా దారిద్ర్యం మీద అసహ్యమేసింది.

"రామనాథం ... రామనాథం."

ఎలిమెంటరీ స్కూలు టీచర్ జోగినాథం యింటికిపోతూ అటు వచ్చాడు.

పంతులుగారికి కుర్చీవేశాడు శాంతమ్మ అక్కడే ఉంది.

"ఏడీ సత్యం. ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడట చురుకైన వాడమ్మా! కాలేజీలో ఇతనిది ఒక్కటే నట ఫస్టుక్లాసు. వృద్ధిలోకి వస్తాడు."

చిన్నప్పుడు అ ఆలు దిద్దించిన పంతులుగారు చెప్పుకుపోతున్నారు.

"చదివించాలేగాని మెడిసిన్ సీటు కళ్ల కద్దుకొని వస్తుంది. అందరిలాగ పదివేలు–ఇరవై వేలు డొనేషను కట్టాల్సిన పని ఉండదు. ఐదేళ్లు కళ్లు మూసుకుంటే డాక్టరైపోతాడు. నా వంటి వాళ్లకు కూడా ఈ ముసలితనంలో ఓ శిష్యుడు డాక్టరుగా ఉన్నాడని ధైర్యం ఉంటుంది."

శాంతమ్మకు స్టెతస్కోపు మెడలో వేసుకొని అటూ యిటూ తిరుగుతున్న సత్యం కనిపించాడు.

రామనాథానికి ఆశ్చర్యమే కల్గింది. డాక్టరీ కోర్సంటే ఉన్నవాళ్ల కోర్సే అనుకొన్నాడు. అంత పెద్ద చదువులు, గొప్ప చదువులు ధనవంతులకే సాధ్యమనుకొనేవాడు.

అంటే తన సత్యం కూడా ఆ చదువులు చదవగలడన్నమాట. అందులో పెద్దడాక్టరీకోర్సు!..

తను డాక్టరుగారి తండ్రి. శాంత డాక్టరుగారి తల్లి. పద్మ డాక్టరుగారి చెల్లెలు. పెద్దబంగాళా– హాస్పటల్లో నర్సులు, కాంపౌండర్లు.. రోగులు.

# మరోసారి మనసును గూర్చి

**డా॥ సి. నారాయణ రెడ్డి**

కొలనులోని బురదలోంచి
కుసుమం పుడుతుంది.
మనసులోని రొంపిలోంచి
మరింత కంపు పుడుతుంది.

గాలి మోసుకొస్తుంది
కలగూరగంప వాసనలను.
ఏ వాసనా అంటదు దానికి.
చెదలంటుతుందా నిప్పుమేనికి.

ఒంటికి పట్టిన దయ్యాన్ని
ఊదేస్తారట మంత్రజ్ఞులు.
మనసుకు పట్టిన దయ్యాన్ని
మళ్లించలేరు దైవజ్ఞులు.

## ఓ సత్యం కథ

చిన్నా పెద్దా... ఒకరి తర్వాత ఒకరిని పరీక్షిస్తున్న సత్యం.

"రామనాథం" జోగినాథం పిలిచాడు.

తియ్యటి కల చెదిరిపోయింది.

"సత్యం వచ్చిన తర్వాత నాకోసారి కన్పించమని చెప్పు."

"అలాగేనండి."

బయటవరకూ సాగనంపి వచ్చాడు.

"ఏమండీ! అబ్బాయిని డాక్టరీ చదివిద్దామా?" ఊబలాటం పట్టలేక అడిగింది శాంతమ్మ.

"వాడు మన కడుపున పుట్టాల్సింది కాదు శాంతా !"

"ఏమిటండీ అలా అంటారు."

"వాడిని చూసి మనం గర్వపడాల్సిందే తప్ప, మనను చూసి వాడేమీ గర్వపడాల్సింది లేదు."

"వాడేమీ అటువంటివాడు గాదు. మీరూరికే యిదై పోతున్నారుగాని, వాడంతా బంగారమే."

"మనం తెలివితేటలు గల బిడ్డను కనగల్గాం కాని ఆస్తిపాస్తుల్ని సంపాయించలేకపోయ్యాం."

"అలా తిట్టుకుంటూ కూర్చుంటే అమాంతం యేదైనా వచ్చి ఒరిగిపోతుందేమిటి ?"

నిజమే. భార్య కష్టాలొచ్చినపుడు కుంగిపోవటం కాని, సుఖాలొచ్చినపుడు మితిమీరి గర్వపడటంగాని చేయదు. ముందున్న సమస్యని అందుబాటులోనున్న పరిస్థితులతో యెలా పరిష్కరించాలా ? సాధించాలా ? అని చూస్తుంది.

కాని యిది శక్తికి మించిన పనని తెలియదు. డాక్టరీ చదివించాలంటే మాటలు కాదని ఊళ్లో సుందరరామయ్య అంటూ ఉంటాడు. వాళ్లబ్బాయి విశాఖపట్టణంలో చదువుతున్నాడు. సుందరరామయ్యంత రైతే నానా బాధలు పడుతుంటే తనటువంటి వాడికెలా సాధ్యం ? పైగా పద్మ పెళ్లీడుకొచ్చి కూర్చుంది. దానికి పెళ్లి చేసి పంపాలి. ఉన్న కొంద్రలో దానికీ కొంత యివ్వాలి.

మంచంమీద వెల్లకిలా పడుకొని ఆకాశంవంక జూస్తూ ఆలోచనల్లో పడిపోయిన భర్తను 'ఈయనెప్పుడూ యింతే. చిన్నదానికి పెద్దదానికి హైరానా పడిపోతార'నుకుంటూ యింట్లో పని చూసుకోవటాని కెళ్లిపోయింది. కొంచెంసేపటికి "భోజనానికి లేస్తారా !" లోపలనుండి భార్య కేకేస్తుంది. "సత్యం పట్నానికెళ్తానని చెప్పాడు. ఆలస్యంగా వస్తానన్నాడు. మీరు కానీయండి."

ఇంతలో "రామనాథం; రామనాథం" రోడ్డు మీద నుండి కేక విన్పించింది.


"ఎవరూ ?" రామనాథం లేచాడు. చీకటిలో మనిషి ఆనటంలేదు.


"నేనే రామనాథం ... రాజయ్యను."

"రాజయ్యగారా ! ... మీరే ... రండి రండి...




HTM-AFL-2583




ఏమేయ్ ఆ కుర్చీ ఇలా తీసుకురా'' భార్యను కేకేస్తూనే తనే వెళ్ళి తీసుకొచ్చి వేశాడాయనకు.

రాజయ్య వూళ్ళో మోతుబరి. మత్రేశమ్మైన మాగాణి ఇరవై యెకరాల వరకూ ఉన్నది సిరిసంపదలకు తోడు ఊళ్ళో పెద్దరిక మున్నది.

గ్రామ సర్పంచ్ పరశురామయ్య, ఆయనా స్వయాన అన్నదమ్ముల బిడ్డలు.

తమ వంటి సామాన్యుల యింటికి పెద్దవారు వూరికే రారు. వస్తే అదొక గౌరవం

ఏదో దూరపు బంధుత్వమున్నా తమ మధ్య నున్న అంతస్తులు—అంతరాలు పెరిగి రాకపోకలు తగ్గిపోయినయ్.

రాజయ్య కుర్చీలో కూర్చున్నాడు.

''ఏదో బావగారు దారితప్పి వచ్చినట్లున్నారు'' రామనాథం అడిగాడు.

''ఇది రామనాథం యిల్లుగాదా ?''

''అదేంటి అలా అడుగుతారు.''

''రామనాథం యిల్లేనా అని.''

''అవును.''

''అయితే దారితప్పి రాలేదన్నమాటే'' తన చమత్కార సంభాషణకి, హాస్య ప్రియత్వానికి తనే బిగ్గరగా నవ్వుకున్నాడు.

రామనాథం శ్రుతి కల్పాడు.

''అమ్మాయి ఉందా ?''

''ఇక్కడే ఉన్నాను అన్నయ్యగారూ!'' గుమ్మంలో నించొనున్నది శాంతమ్మ.

''సరిగ్గా అనటం లేదమ్మా! పెద్దవాళ్లమై పోతున్నాం గదా! కాస్త దగ్గరికొచ్చి కూర్చో. ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి.''

ముందుకు వచ్చి గుమ్మం అరుగుమీద చతికిల బడింది.

రాజయ్యగారి కెదురుగా భర్త మంచంమీద కూర్చున్నాడు

వెన్నెల పిండారబోసినట్లుంది.

''సత్యం ఉన్నాడా ?'' రాజయ్య ప్రశ్న.

''స్నేహితులతో కలిసి సినిమాకి వెళ్ళాడు''

''అదో సంతోషం. కష్టపడ్డవాడికి ఆ మాత్రం ఆనందం అనుభవించటానికి హక్కుంటుందిలే.''

# ఓ సత్యం కథ

సత్యం ప్రయోజకత్వాన్ని గూర్చి రాజయ్యగారి కున్న సదభిప్రాయం పట్ల వారికి సంతోషమైంది

''ఏం చేయిద్దామనుకుంటున్నారు ?''

''అదే అన్నయ్యగారు ఏమీ తోయటంలేదు కష్టపడే ఓపిక, తెలివితేటలు వాడికున్నాయని మీ వంటి వారందరూ అంటున్నారు. కాని ఏం లాభం? పీణ మంచిదే కావొచ్చు, వాయించేవాళ్ల ఉండొద్దూ.''

శాంతమ్మ లౌకికానికి రాజయ్య మురిసి పోయాడు.

''చల్లకొచ్చి ముంత దాయటమెందుకమ్మా! ఇవ్వాళ ఏకాదశి. మంచిరోజు. మాట్లాడటానికి వద్దామని నిశ్చయించుకున్నానో లేదో — ఆ ఫలితాలు కూడా ఈరోజే వచ్చినయ్. శుభం అనుకొని బయలుదేరాను.''

''ఏమిటన్నయ్యగారూ '' శాంతమ్మ ఆత్రుత పట్టలేకపోయింది.

''సత్యానికి మా కళ్యాణినిద్దామనుకొంటున్నామమ్మా.''

రామనాథం దంపతులు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు.

ఒకరి వంక ఒకరు చూసుకొన్నారుగాని ఆ క్రీనీడలో మొఖాల్లో భావాలు చదువుకొనటానికి వీలుపడలేదు.

మళ్ళీ శాంతమ్మే అందుకొన్నది ''సత్యాని కప్పుడే పెళ్ళేమిటన్నయ్యగారూ! పదిహేడెళ్ళి పద్దెనిమిది వచ్చినయ్ పోయిన పండక్కి.''

''భలేదానివమ్మా! పిల్లనిస్తామంటున్నావ్‌గాని యిప్పుడే పెళ్లి చేయమనటంలేదుగా.''

''అదిగాదన్నయ్యగారూ! వాడే నాటికైనా సుఖంగా స్థిరపడటమే మాకూ కావల్సింది. మీరను కున్నట్లే మనం నిశ్చయాలు చేసుకున్నా కనీసం మూడు నాలుగేళ్ళన్నా పెళ్లి కాగాలి ఈ లోపల యేం చేయటమన్నదే యీయనకు పట్టుకున్న ప్రశ్న.''

రామనాథం ఒక శ్రోతలాగా అటు యిటూ చెప్తోంది వింటూ ఉన్నాడు.

''నేనిక్కడకు వచ్చింది మీ ప్రశ్నలకు సమాధాన మిద్దామనేకదమ్మా. సత్యాన్ని యం. బి. బి. యస్‌కు పంపుదాం. సీటు తప్పక తెప్పుకోగలడని జోగినాథం మాష్టారు చెప్పతున్నాడు. అయ్యే ఖర్చు నేను పెట్టుకుంటాను. డాక్టరైన తర్వాతనే అల్లుణ్ణి చేసుకుంటాను. కాకపోయినా కళ్యాణి వయస్సు మాత్రమెంత ? పద్నాలుగేగా.''

రాజయ్యగారి ఆలోచనకు యెదురు చెప్పాల్సిన అవసరం కన్పించలేదు. కలిసివచ్చే అదృష్టాన్ని యెవరు కాదంటారు!

అయినా దంపతులిద్దరూ యేకాంతంగా మాట్లాడుకొని ''ఊఁ'' అనుకుంటే అదో సంతృప్తి. ఇదీ శాంతమ్మ ఆలోచన. •

కాని రామనాథం సంతోషం పట్టలేకపోయాడు

''బావగారూ! ఈ రోజునుండి సత్యాన్ని మీ చేతుల్లో పెడుతున్నాం. మంచికైనా, చెడుకైనా వాడి బాధ్యతంతా మీదే. వాడిక యీ రోజునుండి మీ బిడ్డే.''

శాంతమ్మ భర్త నిర్ణయానికి కొంచెం తికమక పడ్డది. కోపమొచ్చింది.

కాని నిర్ణయమైపోయిన తర్వాత తనుకూడా వత్తాసుపలకటం మినహా చేసేదేమీ కన్పించలేదు.

కొంచెం ఆలోచిస్తే నిర్ద్వంద్వంగా భర్త చెప్పిందే సబబనిపించింది ఇటువంటివాటిల్లో నాన్చకూడదు.

ముద్దు వచ్చినపుడే చంక్కెక్కాలి

ఎన్ని విధాల ఆలోచించినా యిదొక కలిసివచ్చిన అదృష్టంగానే తోస్తోంది

* * *

ఇది నాలుగేళ్ళ క్రిందటి మాట

సత్యం రాజయ్యగారి కాబోయే అల్లుడిగా ఊళ్ళో చెలామణి అవుతున్నాడు

వియ్యంకుళ్ళ — వీపరాళ్ళ రాకపోకలు, పరామర్శలు గౌరవాభిమానాలతో, మమతాను బంధాలతో ముడివేసుకుంటున్నవి.

ఈ బంధుత్వం ఉభయ తారకమైందని కూడా ఊళ్ళోవారు తలపోస్తున్నారు

ఆ మూడు ముళ్ళు వేయకపోయినా, వేయించు కోపోయినా సత్యం—కళ్యాణి తమ మనసుల్లో భార్య భర్తలుగానే భావించుకొంటున్నారు.

(ఇంకా వుంది)

పెద్ద కథ

# ఓ సత్యం కథ

## గరికపాటి కృష్ణమూర్తి

### 3

(గత సంచిక తరువాయి)

సంధ్యారుణ కాంతి గోదావరిమీద పడుతోంది.

గోదావరి కన్నకడుపులా వేడిగాల్పుల్ని మింగి చల్లని వాయువుల్ని పంపిస్తోంది.

సత్యం గట్టుమీద కూర్చుని పిల్లవాయువుల్ని పీలుస్తున్నాడు. ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నాడు.

నగ్గరలో సామ్రాజ్య విస్తరణ కాంక్ష గల నియంతలా మర్రిచెట్టున్నది.

కొంచెం దూరంలో జీవిత నిమ్నోన్నతాలను తెలిపే రెండు కొండలు — వాటిమధ్య లోయ

ఇంకా దూరంగా దృష్టి సారిస్తే ఆ కొండల వెనుక ఆకాశం భూదేవిని ముద్దాడుతున్న క్షితిజరేఖ

తన్మయుడై చూస్తున్న సత్యానికి దూరంగా గోదావరిలో నీలాటి రేవువద్ద యిద్దరాడపిల్లలు బిందెలతో నీళ్ళు తీసుకెళ్లటం మానింది.

పొద్దు వాలిపోతూంది.

ఇంటి కెళ్దామని దారిపట్టాడు.

ఆ పిల్లలిద్దరూ పరిహాసాలాడుకుంటూ ఎస్తున్నారు.

సత్యం యెదురుపడ్డాడు

కళ్యాణికి సిగ్గు ముంచుకొచ్చింది.

పద్మ ముసిముసి నవ్వులు నవ్వుకొంటున్నది.

సత్యం కళ్యాణివంక తదేకంగా చూస్తున్నాడు. కళ్యాణి సిగ్గుతో ముడుచుకుపోతోంది. ఒకసారి క్రీగంటితో సత్యంవంక చూసింది. చిలిపిగా చూస్తున్నాడు. బుగ్గలు యెరుపెక్కినయ్ గుండె కొట్టుకుంటున్నది. కళ్ళు దింపేసింది. కాలిగోటితో నేలను రాస్తూవుంది

కళ్యాణి రోజు రోజుకు అందాన్ని సంతరించు కొంటోంది. అసలే చక్కటి రూపం. పసిమిఛాయ. కొనదేలిన ముక్కు. విశాలమైన కళ్ళు, పల్చగా, నాజూగ్గా ఉన్న ముఖవర్చస్సు అసలే చక్కని రూపానికి వయసు మరింత అందాన్ని చేకూర్చింది.

అదే ధ్యాసలో చూస్తున్న అన్నయ్యను 'ఏం అన్నయ్యగారూ! ఇంకా సౌందర్యారాధన పూర్తి కాలేదండీ.'

పద్మ ఆటపట్టిస్తుంది.

''ఒక్క నిమిషంలో పూర్తయ్యేది ఆరాధన యెలా అవుతుందే.''

''అబ్బో! చాలావరకు వచ్చిందే. ఆరాధనలోపడి చదువు మరచిపోయేరు గనక ?''

''పద్మా! వెళ్లిపోదాం రా''

కళ్యాణి సిగ్గుకు చిరుకోపాన్ని మేళవించి అన్నది

''మీ శ్రీమతిగారు. . తప్పు తప్పు. కాబోయే శ్రీమతిగారి ఆజ్ఞానుసారం సెలవు పుచ్చుకుంటున్నాం ''

నవ్వుకుంటూ వాళ్లిద్దరూ ముందుకెళ్లిపోయారు.

సత్యం అలా నడుచుకుంటూ యింటిదారి పట్టాడు.

సెలవుల్లో సత్యం దినచర్య యిది. ఇలా ఒక గంటైనా కాలక్షేపం చెయ్యనిదే తోచదు

ఇలా వచ్చేటప్పుడే ఈ దారుణ సంఘటన జరిగింది

అర ఫర్లాంగు దూరంలోనున్న యీ హత్యను సుందరరామయ్య చూస్తూనే ఉన్నాడు చెంబు తీసుకొనివచ్చిన ఆచారిగారూ చూశారు.

కాని పోలీసులముందు యెవరూ చెప్పటంలేదు.

కాని తను మాత్రం జరిగింది జరిగినట్లు అంతా చెప్పి వచ్చాడు.

వాఙ్మూలం చెప్పటానికెళ్లిన సత్యం యింటి కొచ్చేటప్పటికి యిల్లంతా విచార సాగరంలో మునిగి పోయినట్లుంది.

శాంతమ్మ దిగాలుపడిపోయి ఒకమూల కూర్చుంది. పద్మ గుమ్మంలో నిలబడి వేలాడుతోంది. రామనాథం నడుము విరిగిపోయిన వాడిలా మంచంలో అటూ ఇటూ కదులుతున్నాడు.

సత్యం యిటు ఇంట్లోకి రావటం, అటు రాజయ్య నిష్క్రమించటం ఒకేసారి జరిగినవి.

ఫెనుతుఫాను వీచబోయే ముందున్న ప్రశాంతతలా ఉన్నది వాతావరణం

నిగ్రహించుకోలేని ఆగ్రహావేశాలు వారిముఖాల్లో చోటు చేసుకున్నయ్.

అందరూ సత్యం వంక తదేక దృష్టిని సారించారు.

రోటిలో తలదూర్చి రోకటి పోటుకు వెరవట మెందుకని సరాసరి రంగంలోకి దిగాడు.

''అంత చేయగూడని పనేమి చేశానని అంతగా బాధపడుతున్నారు ''

తల్లి అందుకొన్నది. ''చేసేదేదో — చేయకూడనిదేదో నిర్ణయించుకొనే పెద్దవాడివైన తర్వాత మేం చేసేదేముంది ? చెప్పేదేముంది బాధ పడటం మినహా.''

అమ్మ అలా బాధ పడటం యేనాడూ చూడ లేదు సత్యం.

''పెట్టే చెయ్యిను కొట్టేవాడెటువంటివాడే ?'' నాన్న తనతో మాట్లాడమే యిష్టంలేనట్లు తల్లితో ఒక విసురు విసిరేశాడు.

''భోంచేద్దువుగాని రా అన్నయ్యా.''

పద్మకిది చిలికి చిలికి గాలివాన అవుతుందేమో నని భయంగా ఉన్నది.

ఈ కోపతాపాలలో యేం చెప్పినా విన్పించుకునే టట్లులేరని సత్యం కూడా పద్మవెంట వంటింట్లోకి నడిచాడు.

పద్మ వడ్డిస్తూ రాజయ్య మామయ్య ఎందుకు వచ్చింది, తను సాక్ష్యం ఇస్తే పర్యవసానాలు ఎలా ఉండేది వాళ్ళ మాట్లాడుకున్నదంతా చెప్పింది.

సత్యానికి భోజనం చేయబుద్ధేయలేదు. పెట్టిన నాలుగు మెతుకులు కెలికాడు. పద్మ పెరుగు వడ్డించబోయినా వారించాడు. పళ్లెంలో చేతులు కడుక్కొని బయటికి నడిచాడు

కొడుకు భోజనం చేస్తున్నందుకు శాంతమ్మ మనసు ఊరడిల్లింది. వాడు రాగానే అనే మాటలకు యెక్కడ నొచ్చుకొని అన్నం మానేస్తాడోనని బెంగ పెట్టుకొంది.

రామనాథానికి కూడా మొదటున్నంత కోపం లేదు. ఏదో కుర్రతనం ఎంత చదువుకున్నా ఉద్రేకంతో పూర్వాపరాలు తెల్సుకోకుండా వాఙ్మూలం ఇవ్వటానికెళ్లి వుంటాడని, తర్వాత వివరంగా చెప్పి, ఒప్పించి ఈ అల్లకల్లోలాల్లో చిక్కుపడకుండా అవతలికి పంపించెయ్యవచ్చుని ఆయన నమ్మకం.

రాజయ్య బావకూడా పోలీసు వాళ్లతో చెప్పి తప్పిస్తానన్నాడు.

ఎంతైనా కాబోయే అల్లుడు.

అన్నీ సవ్యంగా జరిగిపోతాయనే ఇన్నాళ్లూ చదివించాడాయన.

ఒకవేళ సత్యం వినకపోతేనో !?

అటువైపు పరశురామయ్య నుండి కూడా వత్తిడి వస్తుంది.

---

**జరిగిన కథ - 1** పరశురామయ్యగారి పొలాన్ని హరిజనుల ఇళ్ళ స్థలాల కోసం పెట్టిన వెంకడిని ఆయన పాలేరు లక్ష్మడు కొట్టి చంపుతాడు. ఈ కేసుపై వాఙ్మూలం ఇవ్వటానికి వెంకడు అన్నకొడుకు సుగుణరావ్‌తో పాటుగా సత్యం కూడా వెళ్లాడన్న వార్త ఆ వూరిలో కలకలం రేపుతుంది రామనాథం, శాంతమ్మల కొడుకు సత్యాన్ని పరశురామయ్య తమ్ముడు రాజయ్య తన కూతురును అతనికిచ్చే ఉద్దేశ్యంతో ఎం.బి.బి.యస్. చదివిస్తుంటాడు.

---

ఇది వారి కుటుంబ సమస్య. పరువుప్రతిష్ఠలు కాపాడుకోవటంలో ఆయన్ని కాదనగలడా ?

ఏంతైనా అన్న. రక్తసంబంధీకులు.

అల్లుడు—అందులో యింకా కాబోయే అల్లుడు కోసం అనుబంధాన్ని వదులుకొంటాడా ? రక్తపాశాన్ని కాదనగలడా ?

ఊంహుఁ !

ఎంతగా ఆలోచించినా రాజయ్య ఇంకో విధంగా జరగటానికి ససేమిరా ఒప్పుకోడు.

సత్యం తన మాట విననినాడు సత్యాన్నే వదులుకుంటాడు.

ఒక్క సత్యాన్నే వదిలిపెడతాడా ? ఇంతవరకు పెట్టిన పెట్టుబడిని కక్కమంటాడు. వ్యాపార సరళిలో రాతకోతలు లేకపోయినా ఇస్తున్న దానిని మాత్రం తను కాదనగలడా ? అలా అన్నరోజున వూళ్ళో తలెత్తుకొని తిరగగలడా ? అసలు తిరగనిస్తారా ?

ఉన్న కొండ్రనమ్మాలి. లేకపోతే ఆ కొండ్రనే ఆయనకు ధరాదత్తం చేయాలి. అప్పుడు తమ గతేంగాను. పద్మ పెళ్ళి ఎలా చేయగలడు ? సంసారాన్ని ఏలా ఈదగలడు ?

రామనాథం ఆ విషమ పరిస్థితిని ఊహించలేక పోతున్నాడు.

కొలిమిలో ఇనుపముక్క కాలిపోతున్నట్లు ఆయన బుర్ర కాలిపోతోంది.

''భగవంతుడా ! అన్నిటికి నీవే శరణ్య''మని మనసులో మొకరిల్లి ప్రార్థించాడు.

ఆ రాత్రి రామనాథం దంపతులు కూడా సత్యాన్ని యేమీ ప్రశ్నించలేదు. ఆవేశం, ఉద్రేకాలు చల్లారిన తర్వాతనే చెప్పేదేదైనా చెవి కెక్కుతుందని కిమ్మనకుండా వూరుకున్నారు.

సత్యం కూడా మర్నాడుదయమే అన్నివిషయాలు పూసగుచ్చినట్లు చెప్పి, తను చేసినదాంట్లో తప్పేమి లేదని వారిని ఒప్పించవచ్చునన్న నమ్మకంతో ఉన్నాడు.

## 5

ఒకరోజు ఉదయం పద్మ కళ్యాణి వచ్చినట్లు చెప్పింది అన్నయ్యకు. కళ్యాణి మామూలుగా ఇంటికి రాదు. పద్మకోసం యెప్పుడైనా యింటికొస్తూ ఉండేది. ఈ సంబంధమనుకొంటున్నప్పటినుండి రావటం తగ్గించింది.

'రా కళ్యాణి ! కూర్చో !'

ఎదురుగానున్న ముక్కాలిపీటమీద కూర్చుంది.

పద్మకూడా అక్కడే ఉన్నది. ఎలాగైన కళ్యాణితోబాటు తనూ అన్నయ్యను ఈ సాక్ష్యాని కెళ్ళకుండా చేయాలి. ఇంట్లో గాలి దుమారం లేవకుండా చూడాలి.

అన్నయ్య సాక్ష్యానికెళ్ళితే ఆ రాత్రి రాజయ్య మామయ్య చెప్పిన పరిణామలేమిటో పద్మ చెవుల్లో గింగురుమంటూనే ఉన్నయ్. అన్నయ్య అన్నయ్యగానే ఉండాలి. కళ్యాణి వదిన కావాలి. అన్నయ్య డాక్టరు కావాలి. అదీ పద్మ కోర్కె.

''కళ్యాణి చాలా బాధ పడిపోతోందిరా అన్నయ్యా !''

''నిజం ?'' చిరునవ్వుతో అడిగాడు.

కళ్యాణి గంభీరంగా ఉన్నది. తన ముందున్నప్పుడు యిదివరకున్న పిచ్చ్గదొంతరలు లేవు.

''కారణాలేమైనా దీనివలన ఉత్పన్నమయ్యే సమస్యలకు బలిపశువులు కావటం అంత భావ్యం కాదేమోనని...'' నేలజూస్తూ అంటున్నది.

సత్యం నవ్వుకున్నాడు.

''అంత స్వార్థంగా ఆలోచించమంటావా ?''


కళ్యాణి భ్రుకుటి ముడిచి 'నా అర్థం అది కాద'న్నట్లు చూసింది. కళ్యాణి అంతరార్థమేమిటో తెలుసు. కోరి కష్టాలు కొనితెచ్చుకొని తమ వాటిల్లో గిలగిల కొట్టుకోవటం భరించలేదు.

''మీరే యెందుకు సాక్ష్యం యివ్వాలి ? చూసిన వాళ్ళు చాలామంది ఉన్నారుగా.''

''అదే నేనూ అడుగుతున్నాను. నేనే యెందు కివ్వగూడదు ? దారుణాన్ని చూసినవాళ్ళల్లో నేనూ ఒకడినేగా.''

కళ్యాణి మౌనం వహించింది. ఈ లోపల పద్మ యేదో అందుకోబోయిందిగాని సత్యం వారించాడు.

''కళ్యాణి ! నీవూ చదువుకున్నదానివి. కొంచెం



బాల్‌గా ఆలోచించు. నిజంగా వాళ్ళు సాక్ష్యాలివ్వక పోవటానికి వారికేవో సంకోచింపే కారణాలుండ వచ్చు."

"అంటే వాళ్ళ వాళ్ళ స్వార్థాలు చూసుకో వచ్చుగాని, మీరు మాత్రం కాదన్నమాట. అందుకనే మిమ్మల్ని ముందు పెట్టారు."

"వారిమీద దోషారోపణ చెయ్యబోకు కళ్యాణీ! వాళ్ళు ముందుకు రాకపోవటానికి సంకెళ్ళుండవచ్చు. వాటిని తెంచుకోలేని బలహీనులనుకుందాం కాసేపు. అయినా నీవన్నట్లు నేనుకూడా నీ మిషతో యీ సాక్ష్యం యివ్వకుంటే నేనూ స్వార్థపరుడి నైపోనా."

"అయితే మీరు మారరన్నమాట."

"నీవన్నదాంట్లోనే నేను మారానన్న సమాధానముంది. అంటే నేను మామూలు స్థితినుండి మరో స్థితి కెళ్ళాననేగదా దానర్థం." లాయర్ వాదన చేసి నవ్వాడు.

"మీరు బి.యల్. చదవాల్సింది."

"అంటే డాక్టరుగా రాణించలేననే?"

ముగ్గురూ నవ్వుకున్నారు.

అన్నయ్య ముఖంలో యీమధ్య నవ్వే కరువైంది. ఇప్పుడిప్పుడే పులకరిస్తోంది.

అన్నయ్య ఒక్కడేం ఖర్మ. ఇంట్లో యెవరూ ఈమధ్య సరిగ్గా లేరు.

ఒకవైపు అన్నయ్య — మరోవైపు అమ్మా నాన్నలు.

రెండూ రెండు ప్రవాహాలే. దేనిదారి దానిది లాగానే కన్పిస్తున్నది.

కళ్యాణి ఆ వంతెన కట్టాలి. కళ్యాణితోటే అన్నయ్యను ఒప్పించాలి.

"ఆడపిల్లల్ని బాధపెట్టటం న్యాయం కాదురా అన్నాయ్!" సంభాషణని పొడిగించే ప్రయత్నం చేసింది పద్మ.

"ఆడపిల్లలు అన్యాయాన్ని చూస్తూ వూరుకో గలరటే! రామి ఆడకూతురు గాదూ!"

సడన్‌గా ముఖ కవళికలు మారిపోయినయ్. "అది సరేననుకో. రామిమీదున్న జాలివలన దాని మొగుడిని తీసుకొని రాగలవేమిటి?"

"మంచి ప్రశ్న వేశావే పద్మా! జరిగింది అన్యాయమని ఒప్పుకొంటున్నావు. అంతవరకూ బాగానేవుంది. రెండోవైపు అదన్యాయమని తెలిసీ ఉదాసీన వైఖరి అవలంబించమంటావు. జరిగిన నష్టాన్ని పూడ్చటం అసంభవం కాబట్టి శూన్య ఫలితం కోసం శుష్క ప్రయత్నాలుచేసి చేతులు కాల్చుకోగూడదంటావు. అంతేనా?"

తను ఇన్ని అర్థాలతో అడగకపోయినా మళ్లీ యెదురు ప్రశ్న వేయకుండా అన్నయ్య వంక బేలగా, నిస్సహాయంగా చూస్తూ వుండిపోయింది.

సత్యానికి పద్మా, కళ్యాణి భయాందోళనలు అర్థం కాకపోలేదు.

తనూ—తన అస్తిత్వం వారుకోరుకొనే పరిధిలోనే ఉండాలని కోరిక, ఆకాంక్ష. వారిద్దరూ కూడా వివిధ కోణాల నుండి తన కష్టసుఖాలలో భాగం పంచుకునే మాట నిజమే. వారికి తనను ప్రేమిం



చటమే తెల్సు. ప్రేమించిన వ్యక్తి కష్టాల్లో పడటం యిష్టంలేదు.

"నువ్వేదో వూళ్ళో పెద్ద నాయకుడ్వై పోవటానికి, ఆలగాజనాన్ని ఆకట్టుకోవాలని యిదంతా చేస్తున్నావంటున్నారందరూ."

నిజమే. ఈ మాట ఆనోటా — యీనోటా తనూ విన్నాడు.

కాని సత్యం దేమీ మాట్లాడలేదు.

ఎటో చూస్తున్నాడు.

ఒక అన్యాయాన్ని కళ్ళారా చూసి, చూసిన దానిని ఉన్నదున్నట్లుగా చెప్పటానికి కూడా అవకాశం — అవరోధాలేనన్నమాట.

చిత్తశుద్ధితో తనకు తాను నిజాయితీగా ఉంటూ నిర్భయంగా మాట్లాడటానికి కూడా హక్కు లేదన్నమాట.

## కంప్యూటరు బస్సులు

పశ్చిమ జర్మనీలో గ్రామ ప్రాంతాలలో నివసించేవారికి రవాణా సౌకర్యం కల్పించేందుకు కంప్యూటరు పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం వలన ప్రయాణీకులు బస్సు కోసం ఎక్కువసేపు నిరీక్షించవలసిన అవసరం వుండదు. బస్ స్టాపునుండి కంప్యూటరు కేంద్రానికి ఫోన్ద్వారా తమ గమ్యస్థానాన్ని తెలియపరిస్తే, ఆ ప్రాంతాలలో అందు బాటులో వున్న బస్సువచ్చి గమ్యస్థానం చేరుస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో రెగ్యులర్ సర్వీసులు ఆర్థికంగా లాభకరంగా వుండక పోవడంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. విమానాలను తయారుచేసే డోర్నియర్ సంస్థవారు ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సంస్థకు నష్టం వాటిల్లకుండా, ప్రయాణీకులకు అసౌకర్యం ఏర్పడకుండా వుండేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు.

మనిషికుండాల్సిన కనీస మానవత — ఒక ప్రాణిని రక్షించలేని నిస్సహాయతైపోయింది. కనీసం దానిని స్వేచ్ఛగా ప్రకటించటానికి కూడా అవరోధాలే నన్నమాట.

పద్మ — కళ్యాణి తమపై యుక్తికమైన ప్రేమాభిమానాలు — తన వ్యక్తిత్వ ప్రకటనకు అడ్డుగోడలు వేయమంటున్నవి.

కాని వాళ్ళు భావిస్తున్నట్లు ఒక అన్యాయం పట్ల ఉదాసీన వైఖరివలన వ్యక్తిగత లాభాలు చేకూరవచ్చునుగాని అదెలా సామాజిక న్యాయ మౌతుంది?

ప్రతివాడు అలా స్వార్థాన్నే చూసుకున్నవాడు యీ సమాజ అస్తిత్వమనేదే యింత కాలం యెలా మనగలిగేది?

అంటే వైయుక్తికమైన యింటరెస్ట్సుతో సామాజిక న్యాయానికి, ధర్మానికి అప్పుడప్పుడూ వైరుధ్య మొస్తుందన్నమాట.

పద్మ, కళ్యాణి మొదటిదానికి ప్రాధాన్యత యివ్వటంలోనూ, తను రెండోదానిని వదులుకోక పోవటంలోనూ తప్పులేదు.

సాంఘిక యదార్థమనేది మనం మనచుట్టూ వుండే పరిస్థితుల కిచ్చే అర్థాలమీద, మనం మన పొరుగువారితో యేర్పరచుకొనే సంబంధ బాంధవ్యాలలో దాగుకొన్నదనేది సత్యం.

ఆ యదార్థం వక్రీభవించకూడదు. సూర్య రేఖల్లా సూటిగానే ఉండాలి. పట్టుకొన్నవాడిని కాల్చినాసరే నిప్పులా ఉండాలి. మలినం చేయగూడదు మసి పూయగూడదు. సత్యమే మౌనాన్ని ఛీల్చాడు.

"ఊళ్ళోవాళ్ళు అనుకునేవన్నీ నువ్వు నమ్ముతున్నావా?"

"లేదనుకో. కాని నిప్పులేనిదే పొగరాదుగా."

"పిచ్చి పద్మా! నాయకత్వమనేది యెప్పుడు పడితే అప్పుడు, యెక్కడ పడితే అక్కడ కొనుక్కొనే వస్తువేమీగాదే. ఐనా తనకు తాను బాధ్యత పడలేని వాడు ఇతరులకెలా బాధ్యత పడతాడు. అటువంటి వాడు నాయకుడెలా ఔతాడు."

"అంటే?" కళ్యాణి ప్రశ్నించింది.

"మన మనసులో అత్యంత విచార కరమైందీ, పరిహరింపదగ్గ భాగమేదైనా ఉందంటే అది మనకు మనం నిజాయితీగా ఉండకపోవటమే. ఆ బలహీనతను మీరు నన్ను వదులుకోవద్దంటారు. మరి ఆ నిజాయితీ నాలో లేనపుడు—నాకు నేనే ఆత్మసాక్షిని కాలేనపుడు నేను చెప్పే మాటంకు విలువేముంటుంది? విన్నవాళ్లలో విశ్వాసం ఎలా కల్గుతుంది? నల్గురిలో విశ్వాసం కల్గించలేనివాడు నాయకుడెలా అవుతాడు?"

పద్మ, కళ్యాణిలకు ఈ వ్యంగ్యపు మాటలు అర్థం కాకపోలేదు.

వాదనలో దిగితే ఒప్పించటం కష్టం.

అన్నయ్య తర్కం ముందు తాను అనేకసార్లు ఓడిపోతూనే వస్తోంది.

అన్నయ్యకున్నంత తెలివితేటలు తనకు లేకపోవొచ్చు. కాని వాటికంటే యెన్నోరెట్లు ప్రేమాభిమానాలున్నయ్. తనకున్న సాధనాలూ అవే.

తను అడిగిందిగాని, చెప్పేదిగాని యెంత విన్నదైనా మంకు పట్టుపట్టి బొటబొటా కన్నీళ్ళు రాలిస్తే మంచులా కరిగిపోతాడు.

తనకోసం దిగివస్తాడు.

ఇష్టంలేనిదైనా చేసిపెడ్తాడు.

తనకిప్పుడు కళ్యాణి కూడా సాయముంది.

ఇద్దరూ కలిసి అన్నయ్యను ఆపెయ్యాలి.


"మీకు వూరు విషయం తెల్సుగా. దిగ దిగా అనేవారేగాని చివరకు ఆదుకునే వారెవరు ఉండరు."


కళ్యాణి భయందోళనల న్నింటికి పరి ఒక్కటే. న్యాయమైనదైనాసరే, దానికోస నిలబడి అన్యాయానికి బలైపోగూడదని.

"ఔను. ఊరు విషయం తెల్సు."

ఊరు చిన్నదే. సమస్యలు మాత్రం పెద్దవిగా ఉంటూ వస్తున్నయ్.

ధనం, అధికారం, బంధుత్వం - ఆశ్రిత




పక్షపాతం — యివన్నీ యేకమై ఒక కొండచిలవలా వూరు తయారైంది.

న్యాయం, ధర్మాలు దానికి ఆహార పదార్థా లౌతున్నాయి.

ఆకలైనపుడు ఆరగించటమే దానికి తెల్సు.

దాని నోటిలోపడ్డ ప్రాణి సంకటావస్థ దానికి కాదు.

చర్మం చిట్లినా, రక్తం కారినా, ఎముకలు విరిగినా ఆఖరకి ప్రాణం పోయినా తిన ఆకలి తనది.

ఆచారి కూతురు యెందుకు రేప్ చేయబడ్డది? తప్పు తనది కాకపోయినా, మరనాడు చెరువులో దూకి యెందు కాత్మహత్య చేసుకున్నది ?

తాను చెయ్యని తప్పుకు తనకు తానే యెందు కంత దారుణమైన శిక్షను విధించుకొన్నది ?

అన్యాయాన్ని, అధర్మాన్ని యెదిరించే శక్తి లేకేగాదు —

'అవమానాన్ని భరించలేక, జరిగిన దుష్కృత్యాన్ని నలుగురిలో చెప్పుకోలేని ఆత్మాభిమానాన్ని చూపుకో లేక ఆ అఘాయిత్యాని కొడిగట్టింది.

ఊళ్లోవాళ్లు యేం చేయగలిగారు ?

చాటుమాటుగా జరిగిన అన్యాయానికి ఆచారి వద్ద సానుభూతిని మాత్రం విడవగల్గారు.

ఆచారి శోకతప్త హృదయాన్ని మాటలతో గుమ్మరించిన సానుభూతి మాత్రమే ఓదార్చుస్తుందా?

నిన్న ఆచారి కూతురు. రేపు మరో పంతులుగా రమ్మాయి. ఇంకో రోజు మరో అనాథ.

ఈ దారుణాలిలా జరిగిపోవాల్సిందేనా ?

''రైట్ కళ్యాణి! నాకున్న విజ్ఞానం, అనుభవం పరిధిలో అర్థం చేసుకోగల్గినంత అర్థం చేసుకోగల్గాను దీంట్లో తలదూర్చటం నీవన్నట్లు కోరి కష్టాలు కొనితెచ్చుకోవటమే. కాని నన్ను వేధిస్తున్న ప్రశ్న ఒక్కటే.''

''ఏమిటి ?'' పద్మ ఆతురతతో అడిగింది, అన్నయ్య దారిలోకొస్తున్నాడు.

''మీరు కోరిన ప్రకారం ఒక అన్యాయాన్ని యెదుర్కోలేని బలహీనుణ్ణి అవుదామన్నా నన్ను వేధిస్తున్న సమస్య నా అంతరాత్మకు నేను న్యాయం చేకూర్చలేక పోతున్నాననే.''

## ఓ సత్యం కథ

విషయం మళ్లీ మొదటికొచ్చేటప్పటికి పద్మ, కళ్యాణి కూడా హతాశులయ్యారు.

ఇంతలో శాంతమ్మ వంటింట్లో నుండి చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

కళ్యాణి లేచి ''నేను వస్తానండి'' అన్నది శాంతమ్మతోనే.

''అదేమిటమ్మా ! ఏదో ఒకటి తేల్చుకొని వెళ్లు'' నవ్వుతూ అంది. కొడుకువైపు తిరిగి ''చెప్పరా యేం చెబుతావో.''

''పెళ్లాం మాటలని మారిపోయాడమ కొంటారని భయంగా ఉందమ్మా అన్నయ్యకు.''

కళ్యాణి 'అదేమి మాటల'న్నట్లు మోచేత్తో పొడిచింది పద్మను.

పద్మా, శాంతమ్మ నవ్వారు

''నేనొస్తానండి'' కళ్యాణి ఒంటినిండా పైట కప్పుకొని వెళ్లిపోయింది

పద్మ గుమ్మంవరకూ సాగనంపి వచ్చింది.

''ఆ పిల్ల బాధ ఆ పిల్లది ఎంతైనా ఆ తీపి అటువంటిది'' శాంతమ్మ తనలో తానన కొన్నట్లు అన్నది.

అమ్మ ముఖం వంక చూశాడు. ఒక నిమిష మ్ముందున్న సంతోష ఛాయలు మటుమాయమై నట్లున్నది.

ఎప్పుడూ ఉండే ప్రశాంతత స్థానంలో గంభీరత చోటు చేసుకున్నట్లనిపించింది. ఏనాడూ లేని భయాందోళనలు దోబూచులాడుతున్నయ్.

తనకు యే చిన్న జ్వరమొచ్చినా తనకంటే యెక్కువ బాధపడుతుంది.

తనకది సింపుల్ జ్వరం కావొచ్చు. నయం చేసుకోగల వైద్య పరిజ్ఞానంగల డాక్టరు కావొచ్చు

కాని తన చిన్నతనంలో ఏదైనా వస్తే యెలా ఆందోళనపడేదో ఈనాడూ అంతే.

దీనినిబట్టి అమాయకత్వంగానే కొట్టేయ గలడా ?

లేదు.

ఆ ఆందోళన వెనకున్న హృదయాన్ని అర్థం చేసుకోగల్గితే అదెంత అమృతవాహినో తెలుస్తుంది

ఏ శాస్త్రం ఆ ప్రేమను కొలుస్తుంది ? ఏ శాస్త్రజ్ఞుడు లెక్కేసి చెప్పగలడు ?

ప్రక్కన చతికిలబడుతూ ''బాబూ సత్యం ! నువ్వు చేసింది; చేయబోయేది తప్పనిగాని, ఆ కుటుంబానికి అవమానం తెచ్చే పనిగాని నిన్ను నిందించటంలేదు. రాత్రి మీ నాన్న అన్న మాటల్లో ఉద్దేశం కూడా అదికాదు. తినో... తినకో లేక తినగలిగీ తినలేకపోయో నిన్ను యీవరకు తీసుకొచ్చా రాయన. నీవూ అలాగే ఆయనకు తగిన కొడుకు వనిపించుకుంటూ వస్తున్నావు, కష్టపడి క్లాసులు తెచ్చుకొంటున్నావు. పడిన కష్టానికి తగిన ఫలితాన్ని పొందుతున్నావు. మీ నాన్న పడిన కష్టానికి కూడా తగిన ఫలిత ముండేటట్లు చూడు నాయనా ! ఆ తృప్తి ఆయనకి దక్కనియ్.''

గత రాత్రి నాన్న విసిరిన మాటలకు మనసులో కష్టం పెట్టుకొని, యెక్కడ యెదురు చెపుతావోనని, నాన్నను కర్తగా చేసి చెప్తున్న అమ్మ మనసుకు, లౌకిక జ్ఞానానికి లోలోన నమోవాకాలర్పించాడు.

(ఇంకా వుంది)

### వెలుతుర్లోనే చూడాలి

నేస్తం !

వెలుతుర్లోనే చూడాలి
చీకట్లో నడిచే దారిని
ఎంత దూరం చీకట్లో వెళ్తే
వెలుతురొస్తుందో అని
ఆ లెక్క చేసుకోవాలి
ఆ లెక్కన నడచిపోవాలి
అలా నడచుకున్ననాడే
జీవితం.
ఉండాలి —
జీవితానికి ఆ మాత్రం లెక్క
మనిషికి రేపు మీది చూపు.

— జి. వెంకటేశ్వర్లు

పెద్దకథ

# ఓ సత్యం కథ

## గరికపాటి కృష్ణమూర్తి

(గత పంచిక తరువాయి)

అమ్మా వాన్నల ఆందోళన, పద్మ ఆవేదన, కళ్యాణి ప్రేమానురాగాలు—యివన్నీ హృదయాన్ని కదిలించేవే. కాని మనసును యెందుకు ఆకట్టుకో లేకపోతున్నయ్ ?

వాటిల్లో పరిపూర్ణత లేకనా ?

విశాల దృక్పథం కొరవడినందువా ?

తమ కోణాల మండే చూడటం వలన సర్వ సమగ్రమైన యదార్థాన్ని గ్రహించలేకనా ?

ఒకవేళ గ్రహించినా, ఆ యదార్థాన్ని తట్టుకో లేని బలహీనులు కావటంవలనా ?

ఒక బలవత్తరమైన అన్యాయాన్ని, అక్రమాన్ని యెదుర్కోవాలంటే, న్యాయానికి, ధర్మానికి కూడా అంత బలముండాలా ?

లేకపోతే కళ్యాణి అన్నట్లు బలిపశువులుగా రాలిపోవటమేనా ?

ఒకవేళ తెగించి త్యాగం చేసినా, ఆ త్యాగ స్ఫూర్తి వాళ్ళతోనే అంతరించి పోతుందా ?

ఒకవేళ అలాగే జరిగితే మనకు స్వాతంత్ర్య మెట్లానచ్చేది ?

స్వాతంత్ర్య సమరయోధులందరూ తమ జీవిత కాలంలోనే ఈ స్వాతంత్ర్య ఫలాన్ని చవిచూస్తామని కోరి కష్టాలు వరించారా ?

లేదే !

మేము కష్టాలుపడ్డా భావితరాలవారు సుఖ పడతారనే త్యాగ భావమే లేకపోతే వృద్ధాప్యంలో సైతం జైలుకెళ్ళే ప్రసక్తే ఉండేది కాదు గదా !

వాళ్ళంత సుదీర్ఘమైన పోరాటాన్ని సాగించి నపుడు వారందరినీ సరైన పథ నిర్దేశకులిని చేసిన శక్తులేమిటి ?

గాంధీజీ సత్యం—అహింసలు.

తమ హృదయాంతరాళాలలో ప్రజ్వరిల్లిన స్వాతంత్ర్య ఆర్తికి సత్యాహింసలను తోడు చేశారు. వాటిని ఆయుధాలుచేసి పోరాడారు.

స్వకీయ భౌతిక భోగాలను, సుఖ సంతోషాలను అవతల బెట్టేశారు. ప్రలోభాలను సత్యాగ్నిలో కల్చేశారు

తాము నమ్మిన దానిని ఆత్మ సాక్షిగా పలికారు. ఆచరించారు.

పిరికి పందలగా యెక్కడి కక్కడ సర్దుకొని పోక యే వత్తిడులకు తలొంచక సత్యాన్ని నిర్భయంగా పలికారు. నిరాఘాటంగా ఆచరించారు.

మరి ఆ దారి ఇప్పుడెక్కడుంది ? ఆ శక్తి యెక్కడకు పోయింది ?

సర్వకాలీయం, సర్వసమగ్రమైన దానిని ఒక స్వార్థం, ఒక భయం దానిని కప్పుపుస్తుందా ? కన్పించకుండా చేస్తుందా ? విన్పించకుండా అవుతుందా ?

లేదు.

ఆకాశంలో శబ్దంలా అది కన్పించదు. రాళ్ళ వంటి చెవిటి వాళ్లకు అది విన్పించదు.

మనో దృక్కులకు కన్పిస్తుంది. హృదయ చక్షువులకు విన్పిస్తుంది.

''అమ్మా! నీకు గుర్తుందో లేదోగాని ఒకసారి నన్ను కొట్టావు. చెల్లాయిని కొట్టి, కొట్టలేదని నీ దగ్గర బుకాయించినందుకు 'అబద్ధమాడతావురా వెధవా' అంటూ చింత బరికెతో బాదావు. ఒక చిన్న తప్పిదానికే దండించిన దానివి ఈనాడిలా ఎందుకు పిరికి మందు పోస్తున్నావో అర్థం కావటం లేదు.''

శాంతమ్మకు కొడుకు పెరిగిపోయినవాడిలా కన్పించాడు నిరుత్తరురాలై—

''ఏముంది బాబు ! కడుపుతీపి.''

**జరిగిన కథ - 2** పరశురామయ్యగారి పొలాన్ని హరిజనుల ఇళ్ల స్థలాల కోసం పెట్టిన వెంకడిని ఆయన పాలేరు ఒకమ్మడు కొట్టి చంపుతాడు ఈ కేసుపై వాంగ్మూలం ఇవ్వ టానికి వెంకడు అన్నకొడుకు సుగుణరావ్‌తో పాటుగా సత్యం కూడా వెళ్లాడన్న వార్త ఆ వూరిలో కలకలం రేపుతుంది రామనాథం, శాంతమ్మల కొడుకు సత్యాన్ని పరశురామయ్య తమ్ముడు రాజయ్య తన కూతురును అతనికిచ్చే ఉద్దేశ్యంతో ఎం బి బి.యస్ చదివిస్తుంటాడు. సత్యాన్ని ఆ కేసు నుండి తప్పించాలని శతవిధాలా ప్రయత్నించి విఫలులౌతారు కళ్యాణి, పద్మ.

ఈ కడుపుతీపికి తను లొంగిపోవాలా ? కళ్లారా చూసిన దానిని చూడలేదని చెప్పే పిరికివాడిని కావాలా ? పిరికితనాన్ని ముసుగేసుకొని తప్పుడు మాటలను కోర్టులో సాక్ష్యంగా చెప్పాలా ?

ఈలోగా బయటనుండి నాన్న యెవరితోటో ఘర్షణ పడుతున్నట్లు విన్పిస్తోంది

శాంతమ్మ ఆదుర్దాగా బయటికెళ్లింది

గొంతుమబట్టి నాన్నతో మాట్లాడేదెవరో సత్యం గ్రహించేశాడు.

కళ్యాణి అన్నయ్య—ప్రసాద్—కొంచెం గొంతెత్తి అరుస్తున్నాడు.

రామనాథం తగ్గి తగ్గి మాట్లాడుతున్నాడు అప్పుడప్పుడూ బతిమాలుతున్నట్లుగా కూడా విన్పిస్తోంది.

కోపాన్ని, అభిమానాన్ని దిగమింగుకుంటూ ''నా ఖర్మ బాబూ ! నా ఖర్మ. ఏ జన్మలోవో చేసుకున్నది అనుభవించివద్దూ'' అంటున్నాడు.

సత్యం స్పష్ట స్పష్టంగా ఇవన్నీ వింటూనే ఉన్నాడు.

తండ్రి మనసు యెంత గాయపడిందో, అభిమానమెంత దురపిల్లుతుందో అర్థం కాకపోలేదు

వెళ్లి ప్రసాద్‌ను చెడామడా నాల్గు చివాట్లు పెడదామనుకున్నాడు

కాని నాన్న రెచ్చిపోతాడు

ప్రసాద్ విసుర్లు ఇంట్లోవున్న తనకేగాదు, బజారులోపోయే వాళ్లకి కూడా వినబడేలా బిగ్గరగానే అరుస్తున్నాడు

''ఆల్‌రైట్. మీరు మీ ఇష్టమొచ్చినట్లు వూరేగండి. మాకేమీ అభ్యంతరం లేదు. మేం పెట్టిన పెట్టుబడంతా వడ్డీతో సహా పారేయ్యండి పాలు తాగి రొమ్మును గుద్దేవాళ్లను మేం నమ్మలేం.''

సత్యం బయటకొచ్చేలోపల ప్రసాద్ విసవిసా వెళ్లిపోయాడు

రామనాథంకళ్లు క్రోధాగ్నితో భగ్గుమంటున్నయ్ కన్న కడుపుతీపే లేకపోతే అవి యెదుటున్న సత్యాన్నే దగ్ధం చేసి ఉండేవి.

శాంతమ్మ ''రారా సత్యం'' కొడుకును లోపలికి తీసుకెళ్లింది. ఇటువంటి పరిస్థితులను యెలా సేవ్ చేయాలో ఆమెకు బాగా తెల్సు

కాబోయే బంధుత్వ బాంధవ్యాలకంటే ప్రసాద్ మిత్రుడుగ సన్నిహితుడు

నేరుగా తననే వచ్చి అడగవచ్చు

తను చెప్పేది రైటనుకుంటే ఒప్పించవచ్చు

అలా అనేకసార్లుగా అనేక విషయాలమీద ఒకరికొకరు దగ్గరౌతూ వచ్చారు

మరిప్పుడిలా ప్రవర్తించాడేం ? అంటే స్వార్థం — తనదిగాని తనవాళ్లదిగాని — వచ్చేటప్పటికి మిగితావన్నీ తరవాతవే నన్నమాట

ప్రసాద్ కూడా అంత సంకుచితంగ ఆలోచిస్తున్నాడా ?

అంత ఆలోచించే స్థితిలో కూడా లేడా ?

లేక తనే అతనిని అర్థం చేసుకొనటంలో పొరపాటుపడ్డాడా ?

మనుషులంతా యింతేనా ?

సత్యంలో ఒక రకమైన జుగుప్స, ఏవగింపు కల్గినయ్. బుర్ర వేడెక్కిపోయింది. మనసు చికాకుగా ఉంది.

అలా శివాలయం వైపు వెళ్ళొస్తే బాగుంటు దనుకొన్నాడు. మనసుకు కొంచెం ప్రశాంతతైనా దొరుకుతుంది.

తల్లి భోజనంచేసి వెళ్ళమని పిలుస్తున్నా "ఇప్పుడే వస్తాన"ని వెళ్ళిపోయాడు.

## 6

ఆలయంలో ఆచారిగారున్నారు.

స్తంభాన్నానుకొని, దిగాలుగా, అనంతమైన వినీలాకాశంవైపు శూన్య దృక్కులు సారిస్తున్నాడు.

ఆచారి అంతర్మథనంలోకూడా అంత వేడున్నది. అన్నీ భుగభుగలున్నయ్.

కూతురు అలా అన్యాయమైపోయిన తర్వాత అన్నీ పోగొట్టుకున్న అభాగ్యుడైపోయాడు.

భార్య పోయినా ఏకైక కూతురిమీద ఆశలన్నీ పెంచుకుంటూ వచ్చాడు.

రూపానికి తగ్గట్టు గుణ సౌందర్యం, స్నిగ్ధత్వం సంతరించుకుంటూ పెరిగింది.

ఇల్లరికపుటల్లుణ్ణి తెచ్చుకొని యింటిలో పెట్టుకొందామనుకున్నాడు.

పిల్లాపాపలతో కళకళలాడుతూ యింట్లో తిరుగాడుతుంటే మురిసిపోవాలనుకున్నాడు.

వారి వేతులమీదగానే దాటిపోదామని ఆశ పడ్డాడు.

కాని జరిగిందేమిటి ?

భగవంతుని లీలలమీద గాఢ నమ్మకం, విశ్వాసాలున్నవాడైనా — తనకు జరిగిన అన్యాయాన్ని విధి బలీయమనుకోలేక పోతున్నాడు.

ఎవరు చేసిన వాటికి, వాళ్ళే కర్తృత్వం వహించి ఫలితాలననుభవిస్తారని తను యిప్పటివరకూ అందరికీ చెప్తూ వస్తున్నాడు.

తన బిడ్డ అంత ఫలిత మనుభవించటానికి అది చేసిన దుష్కృత్య మేమిటి ?

ఏమీలేదు.

అంటే తను చేయనిదానికి తాను బలైపోతే యింకా కార్య—కారణ సంబంధమేమిటి ?

తను చదివింది, చెప్పేది వట్టి మాయ. లౌకిక ప్రపంచంలో చెప్పే ఆదర్శాలు, ధర్మాలు, నీతులు ఆచరణలో కొచ్చేటప్పటికి అన్నీ ఎండమావులే. వాటినంటి పెట్టుకొని ఉంటాయనే పాపపుణ్యాలూ ఎండమావులే.

లేకపోతే ఏ ధర్మాన్నైతే నాశనం చేయాలనుకుంటావో ఆ ధర్మమే నిన్ను నాశనం చేస్తుందనే శాస్త్రం ధర్మ బద్ధంగా బ్రతుకుతున్న తన బిడ్డ శీలాన్ని ఆ పరశురామయ్య కొడుకు దౌష్ట్యానికి, కామ తృష్ణకు బలైపోయిందే! మరి ఆ ధర్మం ఆ కిరాతకుణ్ణి యెందుకు నాశనం చేయదు ? వాడి ప్రాణాలను యెందుకు బలిగొనదు ?

లేదు. ధర్మం లేదు. న్యాయం లేదు నలుగురూ చెప్పేది, ఆచరించేది ధర్మం, న్యాయమనుకొన్నప్పుడు ఆ నలుగురూ నా బిడ్డకు జరిగింది అన్యాయమని, అధర్మమని యెందుకు ఎలుగెత్తి చాటరు ? దోషిని యెందుకు శిక్షించరు ?

ఊఁహూ !

శిక్షించలేరు. కనీసం వల్లెత్తు మాటనలేరు

వారి మనసులకు కళ్ళేలున్నయ్ హృదయాలకు సంకెళ్ళున్నయ్.

ఇప్పుడు వూరుని పరిపాలించేది ఒక ఆటవిక న్యాయం

బలమైన జంతువుకు బలహీనమైన ప్రతి జంతువూ లోకువే

పులికి వేటాడటం న్యాయం, ధర్మం


కుందేలుకు తప్పించుకొనటమే ఉన్న హక్కు

ఆ హక్కును వినియోగించుకోలేనిది ఆహారమై పోవటమే అది దాని ఖర్మ.

ఆచారి లోలోన నిర్లిప్తంగా నవ్వుకుంటున్నా అది అప్పుడే వచ్చిన సత్యానికి వినిపించింది






"నమస్కారం ఆచారిగారూ!"

"సత్యమా! రా! బాబూ రా! ఏమిటి విశేషాలు?"

సత్యానికేం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు

ఊళ్ళో ప్రస్తుతమున్న విశేషాలకు తమూ, ఆచారి అద్దాలు వంటివారే.

కాని వూళ్ళో జనం తమ మనస్తత్వాల ప్రతిబింబాలను మాత్రం చూసుకోలేకపోతున్నారు.

కనీసం దానికైనా సమాధానం దొరుకుతుందని సత్యం ఆచారి దగ్గరకు వచ్చాడు. ఆచారి కెదురుగా నున్న స్తంభాని కేలాడపడి కూర్చున్నాడు.

ఆచారి మాత్రం యేదో దీర్ఘాలోచనలో మునిగి ఉన్నట్లున్నాడు. ఆ ఆలోచనకు కారణమూ తెల్సు.

"ఊళ్ళో అధికారం ఒక లైసెన్సు అయింది గదూ!" ఆచారి సత్యం ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

ఆచారి కూతురుని మరవలేకపోతున్నాడు.

"అలాగే కన్పడుతోంది. ఆ లైసెన్సు కూడా విచక్షణా జ్ఞానంలేని మూర్ఖుల చేతుల్లో వుంటే యెటువంటి దారుణ ఫలితాలుంటాయోయ్యాగూడ యిక్కడే తెలుస్తుంది."

"ఊరు పూరంతా కళ్ళూ, నోళ్ళూ మూసు కుంటే జరిగేదంతే" ఆచారి కంఠంలో నిర్లిప్తత ఉన్నది.

"అదే నా కర్థం కావటంలేదు ఆచారిగారూ! అధర్మం, అన్యాయం పరాకాష్ఠ చెందినపుడు ధర్మాన్ని సంస్థాపించినవారినిగాని, కనీసం వాటికోసం నిలబడిన వారిని మహాత్ముల కోవకు చెందిన వాళ్ళనుకున్నా, అధర్మం, అన్యాయం విచ్చల విడిగా విజృంభించి నపుడు తమ శక్తి మేరకైనా యెదుర్కోలేని వాళ్ళని కనీసం మనుష్యులని అందామంటారా?"

"నిజమే. నీవన్నది ముమ్మాటికి నిజం. కాని నీలాగా యెందరున్నారు. ఒక ధర్మాన్ని, ఒక న్యాయాన్ని బంధువుగా భావించి, ఆత్మీయ బంధువులను—వారితో ముడివడివున్న స్వార్థచింతన లను విడనాడి యెంతమంది ముందుకు రాగలరు? ఒకవేళ వచ్చినా, వచ్చే వత్తిడిలకు తలొగ్గి ధైర్యంగా నిలబడగల్గే మనోబలం యెంతమందికున్నది? నా అటువంటి వాడిలో ఆవేశం, ఉద్రేకం పరవళ్ళు తొక్కుతున్నా అది యెవరిమీద ప్రవహించలేదు.

# ఓ సత్యం కథ

నా హృదయాంతరాళాల్లోని అగ్ని జ్వాలల భుగ భుగలు నన్ను దహించి వేస్తున్నయ్యేగాని—ఇంకొకరికి వేడినిగాని వెలుగునుగాని యివ్వలేకపోతున్నాయ్."

"మీ నిస్సహాయత, నిర్లిప్తలకు కారణాలు చెప్పనే చెప్పారు. కాని అవి కార్య సాధనాలు కాలేవను కుంటాను."

"రైటే బాబు! నీ హృదయావేశం నా కర్థం కాకపోలేదు. ఈ కట్టె కుములి, కృశించి, చివికి పోయి మట్టిలో కలిసిపోయే కంటే, ఒక ధర్మాగ్ని కాహుతై, బూడిదై పోవటమే నాకు యిష్టం. కాని నేనేమి చేయగలను. ఇంట్లో పిల్లి వడుకునే పరిస్థితి. వంట్లోనా ఓపికలేదు. స్థాన బలంలేదు. భయం మంచుతెరలా ఆవరించున్నది. దానినుండి కాపాడుకోవటానికి ధనం, అధికారం స్వేట్టర్లు లేవు."

నిజమే. పరశురామయ్య పెద్దవాడు. భయం చేతనో, భక్తిచేతనో వూళ్ళోవాళ్ళందరి మనో కుహరాల్లో ఆయనకు పెద్ద పీఠమే ఉంది.

అలా కూర్చోపెట్టుకొన్న ప్రతిమ దైవమూ కావొచ్చు; దయ్యమూ కావొచ్చు. దానిచుట్టూ భక్తి భయం, వేడికోళ్ళు, నిస్సహాయతలు.

ఆచారి వూళ్ళో వాళ్ళందరికంటే తెలివితేటలు గలవాడే. బుద్ధి కుశలత ఉన్నవాడే. భయం విషయం వచ్చేటప్పటికి మిగతా వారికంటే అతీతుడుగా కన్పించటం లేదు సత్యానికి.

ఇద్దరి మధ్య ఆవరించిన నిశ్శబ్దాన్ని ఆచారే మొట్టమొదట చీల్చాడు.

"సత్యం నీ ఉద్వేగం, ఆ వేగం నా కర్థం కాకపోలేదు. ఏ జాతి పక్షులు ఆ జాతి దగ్గర చేరతాయంటారే అది నిజం. ఇద్దరి మనోభావాల్లో సారూప్యమున్నది కాబట్టి నేను నిన్ను యితరుల కంటే యెక్కువ అర్థం చేసుకోగలను. కడిపెడు సానుభూతి యివ్వగలను."

"కాని —"

"అదే నే చెప్పొచ్చేది. జీవితం చాలా కురచైనది. ఆ కురచను మళ్ళీ కొలిమిలో పెడితే జరిగేదేదో అందరికీ తెల్సు."

"అంటే..."

"పరశురామయ్య అను లేక వెంకట్రామయ్య అను. వారి రూపాల్లోనున్న సంఘమను; వ్యవస్థ అను. పేరు యేదైనా అది కొలిమి. బ్రతుకు తెరువు తెలిసినవాళ్ళు, లౌకిక జ్ఞానం కలవాళ్ళు దానిచుట్టూ జేరి చక్కగా చలి కాచుకుంటారు... దానికి బొగ్గులు యెవరంటావ్?... అవి నువ్వూ.. నేనూ... మనటువంటివాళ్ళూనూ"

"బొగ్గులలాగ మనుషులూ జడత్వం గలవాళ్ళే నంటారా? నిర్జీవులంటారా?"

"పోనీ జీవచ్ఛవాలందాం."

సత్యానికి ఆచారిమీద కొండంత ఆశ వుండేది. వయస్సులో పెద్దవాడు. అనుభవం పరిణితి చెందిన వాడు. బాగా చదువుకున్నవాడు. అంతేగాదు మనుషులనుకూడా బాగా ఆకళించుకున్నవాడనే నదభిప్రాయమున్నది.

ఆ అభిప్రాయాలను మార్చుకోవాల్సిన పని యిప్పుడు కన్పించటంలేదు.

నిజం నిప్పులాంటిదని అనేకసార్లు చెప్తూ వచ్చాడు. నిప్పు దహించేస్తుంది. పాప ప్రక్షాళనం చేస్తుంది. చెత్తాచెదారాలను కాల్చేస్తుంది.

అదే ఆచారి ఆ అగ్గిమీద నీళ్ళు పోస్తాడేం?

మరైతే వేడెక్కడిది? వెలుగెక్కడిది?

ఆచారి అడిగాడు. "నీ మెడిసన్ యెంత కాలముంది?"

"రెండేళ్ళు."

"ఆ తర్వాత యేం చేస్తావ్?"

"ఇంకా నిర్ణయించుకోలేదు."

"నిర్ణయించుకున్నా, నిర్ణయించుకోపోయినా ఏదో ఒకటి చెయ్యాలిగా."

"తప్పదు."

"ఔను. తప్పదు, నీకు నీవెలా వున్నా నీమీద ఆధారపడ్డ వాళ్ళను గురించైనా తప్పదు...ఇంట్లో ఆర్థికంగా వెనులుబాటు ఉన్న వాళ్ళయితే, సేవ లాంటి కొన్ని హాబీసు పెట్టుకోవచ్చు."

సత్యం తొక్కలొక్కిన త్రాచయ్యాడు. ఆచారి మీద గౌరవభావము అడ్డొచ్చిందిగాని ఈ హేళనకు యేం చేసేవాడో!

తను సాక్ష్యం యివ్వటం యెవరికో చేస్తున్న సేవలాగాను, సేవను లక్ష్మీపుత్రుల హాబీగాను కించ పరచటం తీవ్రమైన బాధ కల్గించింది.

అందులో ఆచారి అనటం ఇముడ్చుకోలేక పోయ్యాడు.

"నా మీద మీకింత సదభిప్రాయమున్నందుకు థాంక్స్ ఆచారిగారూ! దరిద్రుడు నంతగా కించ

## కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరించబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనా విచారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతి కించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

## ఓ సత్యం కథ

పరచటం కూడా బాగోలేదు. అది మనకు మనమే కించపరచుకొన్నట్లవుతుంది."

కటువుగా సమాధానమిచ్చి లేవబోయాడు.

తన ఉద్దేశం అదిగాకపోయినా సత్యం ఫీలింగ్సును హర్టు చేసినందుకు నొచ్చుకున్నాడు ఆచారి.

"నా ఉద్దేశం నిన్ను అవమాన పరచాలనిగాదు సత్యం. గాయత్రి సాక్షిగా, చనిపోయిన నా బిడ్డ సాక్షిగా చెప్తున్నాను."

ఈ మాటలకు సత్యం మంచులా కరిగి పోయాడు. ఆచారి సిన్సియారిటీమీద సత్యానికెంతో నమ్మకముంది.

"అబ్బెబ్బె! అంత మాటనకండి. మీరు పెద్దవారు."

ఆయన ప్రశ్నలు వేస్తూ ఏదో పాయింట్‌కి తనని డ్రైవ్ చేయబోయాడు.

తనే తొందర పడ్డాడు.

వెంటనే వెళ్ళిపోతే నొచ్చుకోవచ్చని సత్యం మళ్ళీ చతికిలబడ్డాడు.

ఆచారి ముఖంలో ఈసారి ఒక ప్రశాంతత చోటు చేసుకుంది.

"నేనా మాటెందుకన్నానో చెప్తాను. నీ అనుమానం నివృత్తి కూడా అవుతుంది. మనం మనుగడ సాగించే ఈ గ్రామ వ్యవస్థ యొక్క నాగరికతను – సంస్కృతి అను యేదైనా దాని సరిహద్దులు తప్పుగా నిర్వచించబడ్డవేమో ననిపిస్తుంది. డబ్బు, అధికారం, కీర్తి యివన్నీ కేంద్రీకరించబడ్డచోట కొన్ని శక్తులు ఉద్భవిస్తున్నయ్. ఆ శక్తులు మిగతా విలువల న్నింటిని శాసిస్తున్నవి. ఈ సరిహద్దు పరిధులను దాటి మనం సామాన్యంగా ముందుకు దృష్టిని సారించలేకపోతున్నాం. ఒకవేళ యీ సరిహద్దుల నతిక్రమిద్దామన్న భావావేశం మనసును హృదయాన్ని విప్లవీకరించిన, ఆ పరిధుల్లోనే గూడు కట్టుకొన్న నిస్సకత్తులు ముందుకు పోనీయవు. ఇవన్నీ మీ నాన్నకున్న ఆర్థికమైన చిక్కులు – మీ అమ్మ కున్న మమతానురాగాల – నీ చెల్లి ప్రేమబంధం – నీ కోసం వేచి ఉన్న కళ్యాణి అంతరంగం – యీ రూపాల్లో నీకు సంకెళ్ళ వేస్తున్నయ్. వ నిన్ను డోలాయమాన స్థితిలో పెడుతున్నయి. అందుకనే ఆర్థికమైన స్వాతంత్ర్య మున్నవాడు కనీసం స్వేచ్ఛను ప్రకటించుకొనటానికి అర్హుడన్నానుగాని నీదతనాన్ని వెకిలిగా చూడటంకాదు బాబూ!"

ఈసారి బాధపడటం సత్యం వంతయింది. ఆచారిని తొందరపడి తప్పుగా అర్థం చేసుకొన్నా ననుకున్నాడు.

"మీరూహించినట్లు ఆ సంకెళ్ళ ఉన్నవి. మానవత్వాన్ని ప్రకటించుకొనటానికి – తనకు తాను నిజాయితీగా జీవన సరళిని దిద్దుకొనటానికుండే స్వేచ్ఛకు యితర శక్తులు వేసే సంకెళ్ళకంటే యెవరికివారు వేసుకొనేవే యెక్కువ?"

ఆచారి సత్యం వాదనాపటిమకు లోలోన సంతోషపడుతున్నాడు



నెల్లూరులో జరిగిన అక్కినేని నాగేశ్వరరావు జన్మదినోత్సవ సందర్భంగా సినీ సంగీత దర్శకుడు శ్రీ రంగారావుని సన్మానిస్తున్న భాస్కరరావు, సెల్ఫ్ అధ్యక్షుడు శ్రీ సుందరరామిరెడ్డి, అక్కినేని ఆర్ట్స్ అధ్యక్షుడు శ్రీ సుబ్బారెడ్డి గార్లని చిత్రంలో చూడవచ్చు

కాని పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యు డైపోతాడేమోనని భయం

"రైటే. వ్యవస్థ యేదైనా మానవత్వ ప్రకటనకు వ్యతిరిక్తమైనది కాకూడదు. మనిషి మనిషిని చూసి భయపడకూడదు. దాన్ని ప్రోత్సహించనూకూడదు. కాని నీలో వున్న శక్తి, బలం వాటిని యెదుర్కోవటానికి చాలదనే నా అభిప్రాయం."

నిజమే.

ఊళ్ళో చైతన్యం నిద్రపోతున్నట్లనిపిస్తోంది ఒక్కడే తనొక్కడే ఊళ్ళో ఐదు వేల జనాభా గల యెడారిలో ఏకాకిగా గొంతెత్తి అరుస్తున్నట్లని పిస్తోంది.

నలుగురూ తనవెంట తిరగటానికి తనవద్ద ఆర్థికబలమూ లేదు; అంగబలగమూ లేదు గ్రామంలో సానుభూతి ఉందనుకున్నా దానిని ఒక బలంగా తీసుకొనటానికి వీల్లేదు.

పరశురామయ్య, ఆయన కుటుంబం చేసే పనులకు వూళ్ళో నిరసింపు ఉన్నది దానికి అద్దం పట్టే ఒక ప్రతినిధి కావాలి. ఆచారి భావించినట్లు ఆ ప్రతినిధి బలమైన వాడైతే రంగం రంజుగానే ఉంటుంది.

ఆచారి తనకు మాలిన ధర్మం పనికి రాదం టున్నాడు.

చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నా లాభం ఉండదని హెచ్చరిస్తున్నాడు.

కాని ఇది సరైన మార్గమేనా?

అద్దం తనను తాను చూచుకోలేకపోవొచ్చు, అలా చూచుకోవటానికి మరొకరికి సాయపడుతోంది

తనీనాడు అద్దం స్థానంలో ఉన్నాడు

ఇంతలో పక్కింటి కుర్రాడు పరుగు పరుగున వచ్చాడు.

ఇంటికి పోలీసులు వచ్చారు, నిన్ను రమ్మం టున్నారని సత్యంతో ఒగరుస్తూ చెప్పాడు.

సత్యం ఆచారి వద్ద సెలవు తీసుకొని వెళ్ళాడు.

(ఇంకా వుంది)